సాక్షి చిత్తూరు

ఆదివారం । 6 । జూలై । 2025



మామిడిని కొంటాం

జిల్లాలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా మామిడిని కొనుగోలు చేస్తామని రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సెక్రటరీ హామీ ఇచ్చారు. - 8లో



293 కేసుల పరిష్కారం

లోక్‌అదాలత్‌లో భాగంగా పుత్తూరులో 293 కేసులు పరిష్కరించినట్టు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర తెలిపారు. - 8లో



సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

సీజనల్ వ్యాధులపై ల్యాబ్ టెక్నీషియన్లు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ సుధారాణి ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

విద్యాశాఖలో ఇద్దరికి ఉద్యోగోన్నతులు

చిత్తూరు కలెక్టరేట్ : విద్యాశాఖ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతులు కల్పించారు. ఈ మేరకు డీఈఓ వరలక్ష్మి శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల మేరకు చిత్తూరు డీఈఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రెడ్డిశేఖర్‌కు సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి కల్పించారు. ఆయనకు అన్నమయ్య జిల్లా సమగ్రశిక్ష శాఖ కార్యాలయంలో పోస్టింగ్ ఇచ్చారు. అదేవిధంగా తిరుపతి జిల్లా కేంద్రంలోని ఎంఆర్‌సీలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉన్న వనజకు ఉద్యోగోన్నతి కల్పించి తిరుపతి పాఠ్యపుస్తకాల గోడౌన్ లో పోస్టింగ్ కల్పిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఒంటరి ఏనుగు బీభత్సం



ఏనుగు దాడిలో ధ్వంసమైన టమాట పంట

గంగవరం: మండలంలోని కీలపట్ల పంచాయతీ, గాంధీనగర్ పరిసర ప్రాంతాల్లో శనివారం రాత్రి పంట పొలాలపై ఒంటరి ఏనుగు దాడికి తెగబడింది. గ్రామానికి చెందిన రైతు అమ్ములు వ్యవసాయ పొలంలో టమాట పంటతో పాటు వ్యవసాయ పరికరాలను ధ్వంసం చేసింది. ఏనుగుల కట్టడికి అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బీసీ వసతి గృహం అభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న బీసీ వెల్ఫేర్ డీడీ రబ్బానీబాషా

చిత్తూరు కలెక్టరేట్ : కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో జిల్లా కేంద్రంలోని బీసీ వసతి గృహం అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్టు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రబ్బానీబాషా తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని సంజయ్‌గాంధీ నగర్‌లో ఉన్న బీసీ బాలుర వసతి గృహంలో సీఎస్ఆర్ నిధులతో పలు ఉపకరణాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆక్వా కల్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సహకారంతో రూ.12.80 లక్షలు సంజయ్ గాంధీ నగర్ బీసీ వసతి గృహం అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. బీసీ వసతి గృహంలో ఓవర్ హెడ్ ట్యాంక్‌లు, ఆర్‌వో వాటర్ ప్లాంట్లు, ప్లంబింగ్ పనులు, వంటగది ఉపకరణాలు పంపిణీ చేసినట్టు తెలిపారు. ఆక్వా కల్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్లాంట్ జనరల్ మేనేజర్ సకరన్ సనజాక్, ఇతర సిబ్బంది గోపీనాథ్, అక్రమ్, మాధవరావు, ఏబీసీడబ్ల్యూవో వాసంతి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు పర్వానబేగం, కోటేశ్వరరావు, ఉమాదేవి, కరుణ తదితరులు పాల్గొన్నారు.

'వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని చూస్తే సీఎం చంద్రబాబుకు వణుకు పుడుతోంది. అందుకే ఆయన పర్యటనలకు సవాలక్ష ఆంక్షలు పెడుతున్నారు. ఎన్ని అడ్డంకులు పెట్టినా మా నాయకుడు జిల్లాకు వచ్చి తీరడం ఖాయం. హెలీప్యాడ్‌కు కూడా అనుమతివ్వడం లేదు. అందుకనే బెంగళూరు నుంచి రోడ్డు మార్గంలో బంగారుపాళెం చేరుకుంటారు. మామిడి రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తారు..' అని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు.



పలమనేరులో మాట్లాడుతున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

వణుకెందుకు బాబూ?

- ఎన్ని ఆంక్షలు పెట్టినా వైఎస్ జగన్ బంగారుపాళెం రావడం ఖాయం
- మామిడి రైతులకు అండగా నిలవడం తప్పా?
- హెలీప్యాడ్‌కు కూడా అనుమతివ్వకుండా ఆంక్షలా?
- మాజీమంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ధ్వజం

పలమనేరు: 'ప్రజల పక్షాన నిలిచేందుకు ప్రతిపక్ష నేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వస్తే కూటమి ప్రభుత్వం ఆంక్షలు పెట్టడం దేనికని?. అంత బెదురెందుకని..' అంటూ రాష్ట్ర మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మామిడికి గిట్టుబాటు ధర కోసం ఈనెల 9న బంగారుపాళెంకు వస్తున్న సందర్భంగా పలమనేరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జిల్లా నేతలతో ఆయన శనివారం సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో రైతుల పరిస్థితి ఘోరంగా మారిందన్నారు. ఏ పంటకూ గిట్టుబాటు ధరలేక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పొగాకు, మిరప, టమాట రైతులు నష్టాల్లో కూరుకుపోయారని వాపోయారు. ఇప్పుడు మామిడి రైతులు కూడా ఆ కోవలో చేరారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మామిడిని అమ్ముకోలేక రైతులు పడుతున్న బాధలు వర్ణణాతీతమన్నారు. పొరుగునే ఉన్న కర్ణాటకలో రైతులకు అక్కడి ఎంపీ కేంద్రానికి లేఖ రాసి వారిని ఆదుకున్న విషయం తెలిసిందేనన్నారు. కానీ కూటమిలో భాగస్వాములైన టీడీపీ, జనసేన నేతలు ఇక్కడి మామిడి రైతుల కష్టాన్ని ఎందుకు కేంద్రం దృష్టికి తీసుకెళ్లలేదని ప్రశ్నించారు.

పక్క రాష్ట్రాల్లో మరింత మెరుగ్గా మామిడి ధరలు

బంగారుపాళెం: రాష్ట్రంలో మామిడి రైతుల పరిస్థితి మరింత దారుణంగా మారిందన్నారు. తోతాపురి మామిడికి ధర లేక అవస్థలు పడుతున్నట్టు వాపోయారు. కర్ణాటకలో మామిడి రైతుల కోసం జేడీఎస్ పార్టీ నాయకుడు లేక రాస్తే 2.60 లక్షల టన్నుల మామిడి కాలయను కిలో రూ.16తో కొలుగోలు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. మన రాష్ట్రంలో ప్రభుత్వం ప్రకటించిన ధరకు వ్యాపారులు, గుజ్జుపరిశ్రమ యజమానులు మామిడిని కొనుగోలు చేయడం లేదన్నారు. కిలో రెండు రూపాయలకు ధర పడిపోయిందన్నారు. దీంతో దిక్కుతోచని స్థితిలో కొట్టు మిట్టాడుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు.

గత ప్రభుత్వంలో మామిడి టన్ను రూ.25 వేలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మామిడి టన్ను రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు పలికిందని పెద్దిరెడ్డి గుర్తుచేశారు. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన సదుపాయాలను కల్పించి ఆదుకుందని పేర్కొన్నారు.

బాబు మోసాలను ఎండగట్టాలి

సూపర్ సిక్స్ హామీలతో ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మోసాలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామ స్థాయిలో ప్రజలకు తెలియజేయాలని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఏడాది గడిచినా ఒక్క పథకం కూడా పూర్తి స్థాయిలో అందించలేదని ఆరోపించారు. మహిళలు, నిరుద్యోగులు, విద్యార్థులు, రైతులు అల్లాడుతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవని ధ్వజమెత్తారు. 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' అనే నినాదంతో ప్రతి గ్రామానికి నాయకులు, కార్యకర్తలు వెళ్లి బాబు మోసాలను ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎంపీ రెడ్డెప్ప, పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే లలితకుమారి, జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయరెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, బంగారుపాళెం, తవణంపల్లె, ఐరాల, పూతలపట్టు, యాదమరి మండలాల పార్టీ కన్వీనర్లు రామచంద్రారెడ్డి, హరిరెడ్డి, బుజ్జిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మాజీ కన్వీనర్లు సోమశేఖర్, ప్రతాప్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, రాజారత్నం రెడ్డి, జిల్లా పార్టీ మహిళా కార్యదర్శి గోహతిసుబ్బారెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, వడ్డెర, ఈడిగ కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు మొగిలీశ్వర్, ఎల్లప్ప, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు దత్తాత్రేయరెడ్డి, జిల్లా పార్టీ నాయకులు ప్రకాష్‌రెడ్డి, గోవిందరాజులు, శరత్ రెడ్డి, జిల్లా సేవాదల్ అధ్యక్షుడు కిషోర్‌రెడ్డి, ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయసింహారెడ్డి, పలువురు మండల పార్టీ అనుబంధ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నష్టాల ఊబిలో రైతన్నలు

నేడు రాష్ట్రంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని మాజీ మంత్రి పెద్దిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి, మిర్చి, టమాట వంటి పంటలు పండించిన రైతులు ధరలు లేక ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారని వాపోయారు. సాగుకు పెట్టిన పెట్టుబడి సైతం రాక అవస్థలు పడుతున్నట్టు వెల్లడించారు.

హెలీప్యాడ్‌కు అనుమతులివ్వడం లేదు

ప్రతిపక్ష నేతగా మామిడి రైతులకు అండగా నిలిచేందుకు వస్తున్న మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటకు హెలీప్యాడ్‌కు సైతం అనుమతులు ఎందుకు ఇవ్వడం లేదని మాజీ మంత్రి ప్రశ్నించారు. ఇలాంటి చర్యలు దేశంలో ఎక్కడా లేవన్నారు. ఏపీలో భారత రాజ్యాంగంకాకుండా రెడ్ బుక్ పాలన నడుస్తోందని విమర్శించారు. అసలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఎక్కడికైనా వస్తున్నారంటే కూటమి ప్రభుత్వం ఎందుకు అంతలా వణికిపోతోందే అర్థం కావడం లేదన్నారు. మొన్నటి దాకా తోతాపురి మామిడికి ధరలేక రైతులు కాయలు అమ్ముకోలేక తోపుల్లో వదిలేస్తున్నా పట్టించుకోని సీఎం చంద్రబాబు ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నాడని తెలిసి మామిడిపై మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. అంటే జగన్‌మోహన్‌రెడ్డి వస్తేగానీ రైతుల కష్టం ఈ ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు.

మామిడికి వెన్నుదన్ను

మామిడి రైతులకు వెన్నుదన్నుగా నిలిచింది వైఎస్సార్‌సీపీనేనని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. శనివారం స్థానిక మాజీ జెడ్పీ చైర్మన్ కుమార్‌రాజా స్వగృహంలో నియోజకవర్గ ముఖ్యనాయకులతో ఆయన సమావేశమయ్యారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ మామిడి రైతులకు అండగా నిలిచేందుకు ఈనెల 9వ తేదీన మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బంగారుపాళెం మామిడి మార్కెట్ యార్డుకు విచ్చేయనున్నట్టు తెలిపారు. తర్వాత మామిడి రైతుల కష్ట సుఖాలను తెలుసుకుని వారికి మద్దతుగా నిలిచేందుకు చర్యలు చేపట్టనున్నట్టు వెల్లడించారు.



బంగారుపాళెం : మాట్లాడుతున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఇలా..

ఈనెల 9న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బెంగళూరు నుంచి రోడ్డు మార్గంలో కోలారు, ముళబాగిలు, ఏపీ బోర్డర్ గంగ్రాజుపల్లి, నాలుగు రోడ్లు, పలమనేరు బైపాస్ మీదుగా బంగారుపాళెంకు చేరుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్, మాజీ ఎంపీ రెడ్డెప్ప, జిల్లా ఎంపీపీల సంఘ అధ్యక్షుడు మొగసాల రెడ్డెప్ప, వైఎఎస్సార్‌సీపీ పలమనేరు పట్టణ కన్వీనర్ హేమంత్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు ఎస్డీ మురళీకృష్ణ, చెంగారెడ్డి, దయానంద్‌గౌడ, నియోజకవర్గ కన్వీనర్లు, ఎంపీపీ, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

మెగా పీటీఎంకు పరిశీలన అధికారెందుకు?

– భగ్గుమంటున్న యూటీఎఫ్ నేతలు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం ఈనెల 10వ తేదీన చేపట్టబోయే మెగా పీటీఎం సమావేశాలను పరిశీలించేందుకు విట్‌నెస్ (పరిశీలన) అధికారులెందుకని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్‌నాయుడు, మణిగండన్ ప్రశ్నించారు. ఈ మేరకు పలు డిమాండ్‌లను పరిష్కరించాలంటూ ఆ సంఘ నాయకులు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో పాఠశాలల్లో ఈనెల 10వ తేదీన నిర్వహించే మెగా పేరెంట్ టీచర్స్ సమావేశంలో విట్‌నెస్ అధికారిని నియమించడం అవమానకరంగా ఉందన్నారు. ఆ అధికారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులే నియమించుకుని వారిచేత వీడియోలు తీయించి అప్లోడ్ చేయాలని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉత్తర్వులిచ్చారని, వెంటనే ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. గతంలో ఎన్నడూ లేని వింత నిర్ణయాలు ఇప్పుడెందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. టీచర్లను అవమానించేలా ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం భావ్యం కాదన్నారు.

ఇది పీటీఎం కాదు డాక్యుమెంట్ కార్యక్రమం

కూటమి ప్రభుత్వం పీటీఎం కార్యక్రమాన్ని డాక్యుమెంట్ కార్యక్రమంగా మార్చడం సరికాదని ఆ సంఘ నాయకులు మండిపడ్డారు. విద్యార్థుల విద్యాభివృద్ధి అంశం పై చర్చించే కార్యక్రమంగా మార్చాలని కోరారు. పాఠశాలలు ప్రారంభమైన నెల రోజుల్లోపే యోగా పేరుతో వారం రోజులు, పీటీఎం పేరుతో మరో వారం రోజులు బోధన సమయాన్ని హరిస్తున్నారని విమర్శించారు. టీచర్లను బోధనకు పరిమితం చేయకుండా, బోధనేతర కార్యక్రమాల పేరుతో ఒత్తిడికి గురి చేయడం ఏ మాత్రం సరికాదన్నారు. ఇలాంటి అనాలోచిత నిర్ణయాలను కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

5,098 కేసుల పరిష్కారం

చిత్తూరు అర్బన్: జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 5,098 కేసులు పరిష్కరించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తం నిర్వహించిన అదాలత్‌లో సివిల్ కేసులు 271, క్రిమినల్ 4687, ప్రిలిటిగేషన్ 140 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. కోర్టుల వారీగా చూస్తే చిత్తూరులో 1,472, తిరుపతి 2,242, మదనపల్లి 44 , పీలేరు 72, శ్రీకాళహస్తి 268, పుత్తూరు 34, పుంగనూరు 69, పలమనేరు 235, కుప్పం 67, పాకాల 132, నగరి 109, సత్యవేడు 217, వాయల్పాడు 41, తంబళ్లపల్లిలో 96 కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు.

నాకు న్యాయం చెయ్యండి

నగరి : సహకార సంఘంలో రుణం తీసుకొని తిరిగి చెల్లించినా తనకు క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇవ్వకుండా వేధిస్తున్నారంటూ ఎస్.వేలు శనివారం నగరి పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద నిరసన వ్యక్తం చేశారు. జాయింట్ కలెక్టర్‌కు స్పందనలో ఇచ్చిన అర్జీ మేరకు విచారణ అధికారిగా ఉన్న నగరి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కేవీఆర్ కుమార్‌కు వినతిపత్రం అందించడానికి విచ్చేసిన ఆయన తన ఆవేదనను మీడియాకు వెల్లడించారు. కోసలనగరం సింగిల్ విండో సొసైటీ బ్యాంక్‌లో రుణం తీసుకుని దానిని పూర్తిగా చెల్లించినా.. బ్యాంకు ఇన్‌చార్జి సీఈవో తనకు నోడ్యూ సర్టిఫికెట్ ఇవ్వకుండా వేధిస్తున్నారని ఆరోపించారు.



నిరసన వ్యక్తం చేస్తున్న రైతు

పకడ్బందీగా మెగా పీటీఎం 2.0



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో ఈ నెల 10వ తేదీన నిర్వహించే మెగా పీటీఎం 2.0 (పేరెంట్స్ టీచర్స్ మీటింగ్)ను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆదేశించారు. మెగా పీటీఎం అంశంపై శనివారం కలెక్టరేట్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు మెగా పీటీఎం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 2,492 పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఈ సమావేశం నిర్వహిస్తారన్నారు. ఈ సమావేశాల్లో ఒకటి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న 2,54,310 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ నెల 10వ తేదీన మెగా పీటీఎం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. మధ్యాహ్న భోజనం విద్యార్థిమిత్ర కిట్లు, విద్యార్థుల సామర్థ్యాల పురోగతి, విద్యార్థుల నమోదు, తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు.

గుర్తింపు లేని పాఠశాలలపై ప్రత్యేక ఫోకస్

జిల్లా వ్యాప్తంగా గుర్తింపు లేకుండా పాఠశాలలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా గుర్తింపు లేకుండా, ప్రభుత్వ నిబంధనలు అమలు చేయని పాఠశాలల పై ప్రత్యేక ఫోకస్ పెట్టనున్నట్లు తెలిపారు. ప్రతి ప్రైవేట్ పాఠశాల కచ్చితంగా ప్రభుత్వ అనుమతి పొందాలన్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల తల్లిదండ్రుల లిఖిత పూర్వక సమ్మతితోనే విలీన ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో 492 పాఠశాలలను సర్దుబాటు చేసినట్లు చెప్పారు. జిల్లాలో ఏర్పాటు చేసిన మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు తెలిపారు. డీఎస్సీ ప్రక్రియ పూర్తయిన వెంటనే జిల్లాలో కొత్తగా టీచర్లు నియమితులవుతారని చెప్పారు. తల్లికి వందనం పథకంలో నమోదైన అర్జీలను నిర్ణీత గడువు లోపు పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఆర్‌టీఐ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ఇటీవల ఆయా యాజమాన్యాలతో సమీక్ష నిర్వహించి పలు ఆదేశాలిచ్చామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ కమిటీలో ఆరుగురికి చోటు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వివిధ హోదాల్లో ప్రకటించిన పార్టీ రాష్ట్ర అనుబంధ కమిటీలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలకు చెందిన ఆరుగురికి అవకాశం కల్పిస్తూ శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్ర అంగన్‌వాడీ విభాగం ఉపాధ్యక్షులుగా పుంగనూరుకు చెందిన పుష్పావతి, రాష్ట్ర వైఎస్సార్ టీయూసీ జనరల్ సెక్రటరీగా తిరుపతికి చెందిన కేతంరెడ్డి మురళీరెడ్డి, రాష్ట్ర సెక్రటరీలుగా గంగాధర్ నెల్లూరుకు చెందిన వి.సుందర్ రాజు, సత్యవేడుకు చెందిన జీబీ.మునిరత్నం (జీబీఆర్), తిరుపతికి చెందిన తిరుమల రెడ్డి, భరత్ రెడ్డిను నియమించారు.

వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు
వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన నలుగురిని ప్రకటిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. వీరిలో చిత్తూరు జిల్లా నుంచి పలమనేరుకు చెందిన జి.ప్రహ్లాద, ఆర్.చెంగారెడ్డి, ఎస్‌డీ మురళీకృష్ణ, తిరుపతి జిల్లా నుంచి శ్రీకాళహస్తికి చెందిన షేక్ సిరాజ్‌బాషా ఉన్నారు.

కూసాలు ధ్వంసం



పులిచెర్ల(కల్లూరు): మండలంలోని చల్లావారి పల్లె సమీపంలో శనివారం తెల్లవారు జామున ఏనుగుల గుంపు డా.చంద్రబాబు మామిడి తోపులో, తోపు చుట్టూ ఉన్న 48 ముళ్ల కూసాలను ధ్వంసం చేశాయి. అలాగే చుట్టు పక్కల ఉన్న వరి పంటను తొక్కి నాశనం చేశాయి.

సాహిత్య పురస్కారాలకు ఎంపిక

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరానికి చెందిన సంధ్యా శర్మ రాసిన సంధ్యా సమీరాలు(కవిత్వం) కవితా సంపుటి విశాలాక్షి సాహిత్య పురస్కారాలకు ఎంపికైంది. పలు కవితా సంపుటి ఆమె పలు పురస్కారాలకు పంపారు. ఈ క్రమంలో సంధ్యా సమీరాలు అనే సంపుటి విశాలాక్షిని మెప్పించింది. నెల్లూరు జిల్లాలో ఈనెల 20వ తేదీన జరిగే కార్యక్రమంలో పురస్కారం అందుకోనున్నారని నిర్వాహకులు పేర్కొన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య




మృతుడు శరత్ (ఫైల్)

పుత్తూరు: పట్టణ పరిధిలోని మరాఠి రైల్వే గేట్ సమీపంలో శనివారం ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రేణిగుంట రైల్వే ఎస్ఐ రవి కథనం మేరకు.. నాగలాపురం మండలం, కృష్ణాపురం గ్రామానికి చెందిన కె.దేశయ్య కుమారుడు డి.శరత్(30) డిప్లొమా చేసి చెన్నైలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. పుత్తూరులోని సమీప బంధువుల ఇంటికి 15 రోజుల క్రితం వచ్చిన శరత్ మానసిక వేదనతో బాధపడుతూ వచ్చాడు. ఈ నేపథ్యంలో శనివారం రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పజెప్పారు.

జగనన్న వస్తున్నాడనీ..!

'మామిడి'పై ఉరుకులు పరుగులు
- జగన్ పర్యటనతో రైతులను కట్టడి చేస్తున్న కూటమి నేతలు
- ధరల్లేక.. చెట్లు కొట్టేస్తుంటే రైతులపై అటవీశాఖ కేసులు
- ఉన్నట్టుండి రైతులపై ప్రేమ ఒలకబోస్తున్న కూటమి ప్రభుత్వం
- పరిశ్రమల నిర్వాహకులతో ప్రిన్సిపల్ కార్యదర్శి సమీక్షలు
- అయినా సరే.. ఇప్పటికీ కిలో మామిడి ధర తెలియని రైతు



చిత్తూరులోని ఓ ఫ్యాక్టరీ రైతుకు ఇచ్చిన మామిడి ధర లేనటువంటి తూకం రశీదు

చిత్తూరు అర్బన్: అధికారంలో ఉన్న పాలకులు ప్రజల కష్టాలను పట్టించుకోనప్పుడు ప్రతిపక్షం అంకుశమై ప్రశ్నిస్తుంది. జిల్లాలో మామిడి రైతుల కష్టం విని, కన్నీళ్లు తుడవడానికి ప్రతిపక్ష నేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నారని తెలిసిన కూటమి ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు దిగింది. అయినా సరే, మామిడి రైతు కష్టం తీరలేదు. కన్నీళ్లు ఆగడం లేదు. వైఎస్.జగన్ ఫీవర్ పట్టుకున్న యంత్రాంగం .. క్షేత్ర స్థాయిలో పర్యటనలు, సమీక్షలు నిర్వహిస్తూ మసిపూసి మామిడి రైతును ఏమార్చే ప్రయత్నం చేస్తోంది.

ఇప్పటి వరకు ఏం చేశారు?
ఉమ్మడి జిల్లాలో దాదాపు 56 వేల హెక్టార్లలో మామిడి సాగవుతుంటే.. 39,895 హెక్టార్లలో తోతాపురి చెట్ల నుంచి సుమారుగా 5 లక్షల టన్నుల కాయలు దిగుబడి ఉంటుందని అధికారులు అంచనా వేశారు. గత నెల ప్రారంభమైన మామిడి సీజన్.. మరో పది రోజుల్లో ముగియనుంది. ఈ సారి మామిడి విస్తారంగా కాయడంతో రైతులంతా పొంగిపోయారు. కానీ రైతుల ఆశలు ఎన్నో రోజులు నిలవ లేదు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కిలో మామిడికి రూ.12. కానీ జిల్లాలో ఏ ఒక్క ఫ్యాక్టరీ ఈ ధరను చెల్లించ లేదు. చిత్తూరు, గుడిపాల, తవణంపల్లె, పూతలపట్టు ప్రాంతాల్లో గుజ్జు ఫ్యాక్టరీల వద్ద రాత్రింబవళ్లు రైతులు మామిడి కాయల లోడ్‌లతో నిరీక్షిస్తున్నారు. తొలుత టోకెన్ల పద్ధతిని ప్రవేశపెట్టిన ఫ్యాక్టరీల యాజమాన్యాలు.. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడాయి. ఆపై ఎవరు ముందు వస్తే, వాళ్ల పంటను లోపలకు అనుమతిస్తామన్నారు. అసలు కాయలు లోపలకు వెళితే చాలని రైతులు తిండీనిద్ర లేకుండా ఫ్యాక్టరీల వద్ద పడిగాపులు కాస్తున్నారు. కొన్ని చోట్ల గిట్టుబాటు ధర రాకపోవడం, ఫ్యాక్టరీలోలపకు కాయలు తీసుకెళ్లలేని పరిస్థితుల్లో పంటను రైతులు రోడ్లపై పారబోశారు. లారీల్లో మామిడి తీసుకొచ్చి ప్రజలకు ఉచితంగా పంచి పెట్టారు. ఇన్ని జరుగుతున్నా ఏ ప్రజా ప్రతినిధి చేసిందేమీలేదు. అధికారులు సాధించిందీ లేదు. కానీ ఒక్క జగన్ వస్తున్నాడని తెలిసిన వెంటనే ఏకంగా రైతులతో ముఖ్యమంత్రి సమావేశం కావడం, మామిడికి మద్దతు ధర ఇస్తామని ప్రగల్భాలు పలకడం, ప్రిన్సిపల్ కార్యదర్శి చిత్తూరు జిల్లాకు వచ్చి సమీక్షలు నిర్వహించడం, ఫ్యాక్టరీల వద్దకు పరుగులు పెట్టడం చూస్తుంటే జగన్ అంటే ఎంత భయమో అర్థమవుతోంది.

ఇంతకూ కిలో మామిడి ఎంత?
పంట పండించే రైతుకు దాని ధరను నిర్ణయించే హక్కు ఉంటుంది. కానీ మామిడి రైతు మాత్రం తాను పండించిన పంటకు ఇప్పటి వరకు ధర చెప్పలేకపోతున్నాడు. సీజన్ ప్రారంభంలో రూ.12 ప్రకటించిన కూటమి ప్రభుత్వం, ఆపై రూ.8 ప్రకటించి.. మిగిలిన రూ.4 ప్రభుత్వమే భరిస్తుందన్నారు. అటు తరువాత అధికారులు రూ.6 ప్రకటించారు. ఇపుడు కిలో రూ.4–5 మధ్య అంటున్నారు. ర్యాంపుల వద్ద రూ.2–3 పలుకుతోంది. అసలు రైతు నుంచి టన్నులకొద్దీ పంట కొనుగోలు చేసిన ఫ్యాక్టరీలు ఏ ఒక్కరికీ ధర చెప్పలేదు. రైతుల నుంచి ఎంత పటం కొన్నామని స్లిప్పులు ఇస్తున్నారే తప్ప.. అందులో ధర ఎంతని పేర్కొనకపోవడం మామిడి రైతుల దయనీయ పరిస్థితికి అద్దం పడుతోంది.

ఏడుస్తున్న రైతులపై కేసులు
పరిస్థితిని గమనించిన రైతులు మామిడికి భవిష్యత్తు ఉండదనే నిర్ధారణకు వచ్చేశారు. ఉన్న పంటను పారబోసి, వచ్చినకాడికి ఫ్యాక్టరీలకు అప్పగించి.. మామిడి పంటే వద్దనే నిర్ణయానికి వచ్చేశారు. చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లోని పలువురు రైతులు మామిడి చెట్లను పూర్తిగా తొలగించేశారు. ఇది ప్రభుత్వ వైఫల్యానికి అద్దం పడుతుందని, ప్రతిపక్షానికి ఈ అంశం అంకుశంగా మారుతుందని భావించిన కూటమి ప్రభుత్వం కపట ప్రణాళిక రచించింది. చెట్లు కొట్టేస్తున్న రైతులపై వాల్టా చట్టం కింద కేసులు నమోదుచేయించి, జరిమానాలు విధించేలా అటవీశాఖ అధికారులను ఆదేశించింది. జిల్లాలో ఆరుగురు రైతులపై కేసులు నమోదుచేయించి, జరిమానాలు విధించింది. తమకు ఆత్మహత్యలే శరణ్యమైన ఇలాంటి సమయంలో గుండె లోతుల్లోంచి వస్తున్న బాధను దిగమింగుకుని.. తమ కష్టాలు విన్నవించడానికి జగన్ రాక కోసం రోజులు లెక్కబెడుతున్నామని రైతులు పేర్కొంటున్నారు.

నివేదిక సిద్ధం చేయండి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పంచాయతీల్లో 2023–24లో జరిగిన వివిధ పనుల్లో 29 అంశాల పురోగతి పై నివేదికలు సిద్ధం చేయాలని జెడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు అన్నారు. శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, తదితర అధికారులతో ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న పంచాయతీల్లో సంబంధిత సంవత్సరంలో జరిగిన అభివృద్ధి, తాగునీరు, పారిశుద్ధ్యం ఇలా 29 అంశాలపై నివేదికలివ్వాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు మాట్లాడుతూ 2023–24 సంవత్సరంలో పంచాయతీల్లో జరిగిన, జరగాల్సిన అభివృద్ధి పనులపై పూర్తి నివేదికను సేకరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుధారాణి పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం ఆమె ల్యాబ్ టెక్నీషియన్లతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. రానున్నది వర్షాకాలమని, కురిసే వర్షాలకు దోమల ఉధృత్తి పెరగవచ్చన్నారు. దీనికితోడు సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశాలున్నాయన్నారు. ఇలాంటప్పుడు ల్యాబ్ టెక్నీషియన్లు నిర్లక్ష్యంగా ఉండకూడదన్నారు. వచ్చే జ్వరం కేసులను క్షుణంగా పరీక్షలు చేసి కచ్చితమైన రిపోర్టును ఇవ్వాలన్నారు. జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్, మలేరియా అధికారి వేణుగోపాల్ పాల్గొన్నారు.

నకిలీ టోకెన్లు విక్రయించిన వ్యక్తి అరెస్ట్



నకిలీ టోకెన్లు విక్రయించిన వెంకటేష్‌ను అరెస్టు చూపుతున్న సీఐ హనుమంతప్ప

కార్వేటినగరం: ఏబీసీ జ్యూస్ ఫ్యాక్టరీలో కలకలం రేపిన నకిలీ టోకెన్ల విక్రయం ఘటనలో సచివాలయ అగ్రికల్చర్‌ని అరెస్టు చేసినట్లు కార్వేటినగరం సీఐ హనుమంతప్ప తెలిపారు. శనివారం తన కార్యాలయ ఆవరణంలో నిందితుడ్ని అరెస్టు చూపించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండల పరిధిలోని చింతమండి వద్ద ఉన్న ఏబీసీ జ్యూస్ ఫ్యాక్టరీలో ప్రభుత్వం రైతులకు అందించే సబ్సిడీ నమోదు కోసం డీఎం పురం సచివాయ హార్టికల్చర్ అధికారి విధులకు కేటాయించిందన్నారు. ఇతను పుత్తూరు మండలం, నందిమంగళం గ్రామానికి చెందిన కృష్ణయ్య కుమారుడు వెంకటేష్(31) అని పేర్కొన్నారు. అతను ఫ్యాక్టరీ వద్ద నకిలీ టోకెన్లు సృష్టించి రైతులకు అమ్మి సొమ్ముచేసుకున్నట్టు పేర్కొన్నారు. ఒక్కో టోకెన్ రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు విక్రయించినట్టు తెలిపారు. ఇలా సుమారు 31 నకిలీ టోకెన్లు బయటపడ్డాయన్నారు. ఈ మేరకు అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

మామిడిని కొనుగోలు చేస్తాం

- రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సెక్రటరీ చిరంజీవి చౌదరి



తమిళనాడు ప్రాంతంలో క్యూ కట్టిన మామిడి ట్రాక్టర్లు

గుడిపాల: రైతుల వద్ద నుంచి మామిడిని కొనుగోలు చేస్తామని రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సెక్రటరీ చిరంజీవి చౌదరి అన్నారు. శనివారం ఫుడ్ అండ్ ఇన్స్ మామిడి గుజ్జు పరిశ్రమని కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. రైతులకు ఇబ్బందుల్లేకుండా మామిడిని కొనుగోలు చేయాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. అనంతరం రైతులతో ఆయన మాట్లాడారు. అన్‌లోడింగ్‌కు నాలుగు రోజులు పడుతున్నట్లు రైతులు తెలపగా.. అటువంటి సమస్య రాకుండా చూస్తామని తెలిపారు. అనంతరం ప్రాసెసింగ్ యూనిట్‌లో మామిడి తయారీ ఎలా జరుగుతుందోనని ఆయన యాజమాన్యంతో కలిసి పరిశీలించారు.

తమిళనాడుకు తరలిన ట్రాక్టర్లు
రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సెక్రటరీ చిరంజీవి చౌదరి రాకతో మామిడి కాయల ట్రాక్టర్లు అన్నింటినీ తమిళనాడుకు తరలించారు. ఫుడ్ అండ్ ఇన్స్ ఫ్యాక్టరీ తమిళనాడు ప్రాంతానికి ఆనుకుని ఉంది. ఈ నేపథ్యంలో చిరంజీవి చౌదరి వస్తున్నారన్న నేపథ్యంలో ఫ్యాక్టరీ సమీపంలో చిత్తూరు–వేలూరు రహదారిలో ఉన్న ట్రాక్టర్లు అన్నింటినీ వెంటనే సరిహద్దులోని తమిళనాడు ప్రాంతానికి అధికారులు పంపించేశారు. ఇక్కడ పెద్దగా రద్దీ లేదని ఆయనకు తెలియజేశారు. ఫ్యాక్టరీని పరిశీలించి వెళ్లిన అనంతరం గుడిపాల రెవెన్యూ అధికారులు తమిళనాడు ప్రాంతానికి వెళ్లి ట్రాక్టర్లకు టోకెన్లను అందజేసి ఒక్కో ట్రాక్టర్‌ను పంపించారు.

మోసానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు



మట్టి మాఫియా పై ఎల్ఈడీ స్క్రీన్‌లో చూపిస్తూ మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి

గంగాధర నెల్లూరు: రాష్ట్రంలో మోసం అని పదం వినపడితే చంద్రబాబు గుర్తుకు వస్తారని, మోసాలకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అని మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. శనివారం గంగాధర నెల్లూరు మండలంలోని వింజం పంచాయతీ సిద్ధేశ్వరస్వామి కొండ గ్రామంలో చంద్రబాబు చేసిన మోసాలను గుర్తుచేస్తూ ఇంటింటికీ వంచన అనే కార్యక్రమం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కృపాలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని, కూటమి ప్రభుత్వంలో మోసగాళ్లు ఎక్కువగా ఉన్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో డబ్బు ఎక్కువగా ఉన్నవారిని ఎన్నుకుని ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా నిలబెట్టి ప్రజలందరికీ అలివి గాని హామీలిచ్చి మోసం చేశారన్నారు. అదే కోవలో గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే ఉన్నారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఓటింగ్ ముందు రోజు నియోజకవర్గంలోని దళితవాడల్లో ఐదువేల రూపాయల కూపన్లు పంచిపెట్టి ఎమ్మెల్యేగా గెలిచేన తరువాత అడ్రస్ లేకుండా వెళ్లిపోయారని దుయ్యబట్టారు. పాలసముద్రం మండలంలో యథేచ్ఛగా కొండలు తవ్వేసి గ్రావెల్ మాఫియా చేసి చెన్నైకి తరలించేస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలోని గ్రానైట్ క్వారీలలో సెటిల్మెంట్లు చేసి డబ్బులు వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. గంగాధర నెల్లూరులో జరుగుతున్న ప్రకృతి వనరుల ధ్వంసం పై ఎల్ఈడీ స్క్రీన్ పై ప్రదర్శించి ప్రజలందరికీ తెలియజేశారు.

పుత్తూరులో 293 కేసుల పరిష్కారం



ఒక్కటైన జంటతో న్యాయమూర్తి రాఘవేంద్ర

పుత్తూరు: స్థానిక సబ్‌కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో మొత్తం 293 కేసులను పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు ఎస్‌సీ.రాఘవేంద్ర తెలిపారు. కక్షిదారుల మధ్య రూ.2,44,28,593 రాజీ చేసినట్లు పేర్కొన్నారు. 257 క్రిమినల్ కేసులు, 24 సివిల్, 12 ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించినట్లు వివరించారు. ఇందులో విడాకుల కోసం కోర్టుకు ఎక్కిన పుత్తూరు కళ్యాణపురానికి చెందిన అశోక్, పవిత్ర దంపతులకు న్యాయమూర్తులు కౌన్సెలింగ్ ఇచ్చి ఒక్కటి చేశారు. లోక్ అదాలత్ ప్రిసీడింగ్ ఆఫీసర్లుగా సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సీ.రాఘవేంద్ర, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సీ.జానకి, అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి రమ్యసాయి వ్యవహరించారు. లోక్ అదాలత్ బెంచ్ మెంబర్లుగా న్యాయవాదులు ఎం.విజయ్‌కుమార్, ఎస్.లక్ష్మీపతి, ఎడీ.బాలాజీ వ్యవహరించారు. లోక్‌అదాలత్‌ను పురస్కరించుకొని ఉచిత వైద్య శిబిరం నిర్వహించడంతో పాటు మధ్యాహ్నం ఉచిత భోజనం అందజేశారు. పోలీసులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.